ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో..!

సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
యూరాలజీ డాక్టర్ డుమ్మాకొట్టినా హాజరు
విచారణలో కప్పిపెట్టే యత్నాలు..
చివరికి సరెండర్
జేసీ తనిఖీల్లోనూ అడ్రస్ లేని వైద్యులు
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో
వైద్యుల తీరుపై విమర్శలు



7

సారూ.. యాడుండారు..?


పత్తాలేని వ్యవసాయాధికారి
సమస్యలతో రైతుల
ఇబ్బందులు
ఆందోళన చేసినా
తీరు మార్చుకోని ఏఓ



6

అంత సీన్ లేదు..!

హెచ్ఎంపీవీకి భయపడొద్దు
జాగ్రత్తలు పాటిస్తే నయమౌతుంది
కొత్త వైరస్ గురించి వైద్య నిపుణులు



కోవిడ్ అనుభవాల నేపథ్యంలో చైనాలో వైరస్ అనగానే జనంలో గుబులు మొదలౌతోంది. లేనిపోని భయాలు వెంటాడుతున్నాయి. తాజాగా హెచ్ఎంపీవీ గురించి అలాంటి ఆందోళనే నెలకొంది. కానీ దీనికి అంత సీన్ లేదని వైద్య నిపుణులు అంటున్నారు. సాధారణ వైద్యంతో నయమౌతుందని, జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని భరోసా ఇస్తున్నారు. బెంగళూరులో రెండు కేసులు బయటపడిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి, అనంతపురం మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంకను ఆంధ్రజ్యోతి సంప్రదించింది. హ్యూమన్ మెటానిమో వైరస్ ప్రభావం, జిల్లాలో పరిస్థితి గురించి ప్రశ్నించింది.

6

ప్రతి ఫిర్యాదుకూ

పరిష్కారం చూపాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్
- శింగనమలలో డివిజన్ స్థాయి గ్రీవెన్స్



సమస్యపై అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే, కలెక్టర్

శింగనమల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ శివనారాయణ్ శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణి, డీఆర్‌ఓ మలోల, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిప్యూటీ కలెక్టర్ శిరీష, ఆర్డీఓ కేశవనాయుడు ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై 510 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు సులభంగా పరిష్కరించుకోవడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

సమస్యలపై నాయకుల వినతులు

- శింగనమల మరువకొమ్మ వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, శింగనమల గ్రామస్థులు అర్జీ ఇచ్చారు.
- పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యనిర్వహణ కార్యదర్శి డేగల కృష్ణమూర్తి అర్జీ అందజేశారు
- రీసర్వే తప్పులు తడకగా చేశారని, మళ్లీ చేసే సర్వేను ఉచితంగా చేయాలని సీపీఎం నాయకులు ఓబుళు, భాస్కర్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.
- శింగనమలను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల నాయకులు నారాయణస్వామి చిన్నప్పయాదవ్ వినతి పత్రం అందజేశారు.

20 ఏళ్ల నుంచి సమస్య పరిష్కారం కాలేదు

చిన్న జలాలపురం రైతులు



మండలంలోని వెస్టునరసాపురం రెవెన్యూ పొలంలో సర్వే నంబర్లు 179-1333,185,182,330లో చిన్నజలాలపురం గ్రామానికి చెందిన బీసీ రైతులు 15 మందికి 40 ఏళ్ల కిందట డీ పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి వారే సాగులో ఉన్నారు. అయితే 20ఏళ్ల కిందట ప్రస్తుత వైసీపీ నాయకుడు అంజిల్‌రెడ్డి గురుగుంట్ల గ్రామానికి చెందిన కొందరికి అదే భూమిపై రీసర్వే నంబర్లతో పట్టాలు ఇప్పించాడు. వారు ఆ పొలాన్ని ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకుని బ్యాంకులో రుణాలు కూడా తీసుకున్నారు. రుణం కోసం మేము బ్యాంకుకు వెళితే ఈ విషయం బయటపడింది. దీంతో అప్పటి నుంచి మా భూములు మాకే చెందేటట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకుని పోయినా సమస్య పరిష్కారం కాలేదని రైతులు నరసింహులు, పెద్దన్న శేషాద్రి అధికారుల దృష్టి తీసుకుని వెళ్లారు.

12 ఎకరాల భూమిని ఆక్రమించారు



మా 12 ఎకరాల భూమిని రామసుబ్బారెడ్డి అనే భూస్వామి 40 ఏళ్లుగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నాడు. చింతకుంట రెవెన్యూ పొలం సర్వేనంబర్ 1278లో మా మామ దాసరి నరప్పపేరు మీద 13.75 ఎకరాల భూమి ఉంది. ఇందులో 77 సెంట్లు కాలువ ఉండేది. అయితే గత 40 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి మా మామ నుంచి అక్రమంగా లాక్కున్నాడు. అప్పటి నుంచి ఈ సమస్యపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. కలెక్టరే మా సమస్య పరిష్కరించాలి.

- దాసరి లక్ష్మిదేవి, చింతకుంట, పుట్లూరు మండలం

మా అన్నలే బెదిరిస్తున్నారు..

మా ఐదుగురు అన్నదమ్ములకు బొమ్మగాని తండాలో సర్వే నంబర్లు 118, 119లో 12.40 ఎకరాలు ఉంది గత ఐదేళ్ల కిందట నా అన్నలు నాకు రావలసిన 2.40 ఎకరాలను కూడా వారే తీసేసుకున్నారు. పొలం వద్దకు వెళితే కొట్టి, బెదిరిస్తున్నారు. నా భూమి నాకు ఇప్పించండి.

- అంధుడు మంజునాయక్, బొమ్మగాని తండా, బ్రహ్మసముద్రం మండలం

టమోటా కిలో రూ. 9

అనంతపురం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.



హంద్రీనీవా కాలువ

ఇక పటిష్టం..!

అయినా.. భూగర్భ జలాలు తగ్గుతాయని ఆందోళన

- హంద్రీనీవా లైనింగ్ పనులకు రూ.936కోట్లు
- కాలువ మొదటి దశ వెడల్పునకు రూ.256కోట్లు
- లైనింగ్, వెడల్పుపై నాయకుల పెదవి విరుపు
- భూగర్భజలాలు తగ్గిపోతాయని రైతుల ఆవేదన

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును పటిష్ట పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న తొలి దశ 88 కిలోమీటర్ల కాలువ వెడల్పు పనులకు రూ.256 కోట్లు, 190కిలోమీటర్ల లైనింగ్‌కు రూ.936కోట్ల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే లైనింగ్ చేయడంతో జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోయి, ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో హంద్రీనీవా కింద డిస్ట్రిబ్యూటరీలు నిర్మించి పూర్తి చేస్తే లైనింగ్ ఉండటం వల్ల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడం సులభమవుతుందని ఇంజనీర్లు చెబుతున్నారు.

లైనింగ్ కంటే వెడల్పు అవసరం



హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేయడం కంటే ప్రధానంగా కాలువ వెడల్పు చేయడంతోనే అధిక ప్రయోజనాలు ఉన్నాయి. ఒక్కసారి లైనింగ్ చేస్తే ఇక వెడల్పు చేయడానికి అవకాశం లేదు. మల్యాల నుంచి ఫేజ్-1 కింద జీడిపల్లి వరకు కాలువ వెడల్పు చేస్తున్నారు. జీడిపల్లి నుంచి కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేస్తే కింద వైపున ఉన్న ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుంది. డిస్ట్రిబ్యూటరీలు నిర్మించకుండా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం కష్టం. కేటాయించిన ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం చొరవచూపాలి.

- శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రతినిధి

నిధులు కేటాయింపు

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తోన్న హంద్రీనీవా కాంక్రీట్ లైనింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. హంద్రీనీవా ఫేజ్-2 కింద జీడిపల్లి 216కిలోమీటర్ల నుంచి 400కిలోమీటర్ల వరకు కాంక్రీట్ లైనింగ్‌కు రూ.936కోట్లు కేటాయిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫేజ్-1 గుంతకల్లు పరిధిలో సుమారు 88కిలోమీటర్ల హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి చేయడానికి రూ.256కోట్లు కేటాయించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి కృష్ణా జలాలు తరలించేందుకు కాలవ నిర్మాణం, భూసేకరణ పూర్తి చేయడానికి రూ.500కోట్లు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల జిల్లా పర్యటనలో ప్రకటించారు. జీడిపల్లి నుంచి పేరూర్ ప్రాజెక్ట్‌కు కృష్ణా జలాలు తరలించేందుకు భూసేకరణ, కాలవ నిర్మాణానికి రూ.350కోట్లు చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు.

లైనింగ్‌తో ప్రయోజనాలు

హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ చేస్తే అనేక ప్రయోజనాలు కలుగుతాయని జలవనరుల శాఖ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రధానంగా కాలవ కింద నీటి వృథా అరికట్టడంతో పాటు ఎక్కడా గండ్లుపడటం, కాలవ తెగిపోవడం వంటి సమస్యలు ఉండవని చెబుతున్నారు. లాస్ ఆఫ్ వాటర్‌ను తగ్గించడంతో అధికారికంగా ప్రకటించిన చెరువులు, రిజర్వాయర్లు, ఆయకట్టుకు నీరు అందించే అవకాశం పెరుగుతుంది. భవిష్యత్తులో హంద్రీనీవా కిందకు ఎన్ని స్కీంలు తీసుకువచ్చినా నీటిని సరఫరా చేసే వెసులుబాటు కలుగుతుంది. ప్రతి ఏటా లైనింగ్‌తో హంద్రీనీవా కాలవకు వచ్చే నీటిలో 2టీఎంసీల వరకు ఆదాచేసే అవకాశం ఉంటుందని ఇంజనీర్లు పేర్కొన్నారు. కాలువకు లైనింగ్ పూర్తయితే ఎక్కువ నీటిని కిందికి తరలించే అవకాశం ఉండనుంది.



హంద్రీనీవా కార్యాలయం

ప్రశ్నార్థకంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఉమ్మడి జిల్లాలో 3.45లక్ష ల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు మూడు దఫాలుగా ప్రభుత్వానికి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపారు. అయినా అప్పటి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అర్ధంతరంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణ పనులు నిలిపివేయడంతో పిల్లకాలువల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

3.45 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలి



ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాలువ ద్వారా 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేయడం కంటే వెడల్పు చేసి మరింత నీటిని తీసుకునే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎన్నో పోరాటాలు ఫలితంగా సాధించుకున్న హంద్రీనీవా జలాలు జిల్లా రైతులకు ఉపయోగపడాలి. శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవాకు మొదట కేటాయించిన 40టీఎంసీల నుంచి రాజకీయ నాయకుల హామీలతో మరిన్ని స్కీంలు ఇందులోకి చేరాయి. పెరిగిన స్కీంలను దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవాకు 70టీఎంసీల నీరు కేటాయించాలి.

- చిరుతల మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

లైనింగ్ ఎవరి కోసం..?



హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేయడం ఎవరి మేలు కోసమో అర్థం కావడం లేదు. జిల్లాకు తీరని నష్టం కలిగించే హంద్రీనీవా లైనింగ్ చేయడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా లైనింగ్ పనులకు సంబంధించి జారీ చేసిన జీఓ నంబరు 405ను వెంటనే రద్దు చేయాలి. కరువు జిల్లాను ఆదుకోవాలంటే హంద్రీనీవా కాలువ సామర్థ్యం 10వేల క్యూసెక్కులకు పెంచాలి. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా జీఓ ఇవ్వడం సరి కాదు. ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు లైనింగ్ పనులతో వచ్చే నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిలుపుదల చేయించాలి. కాలువ వెడల్పు చేయడానికి అనుమతి పొందేలా పోరాడాలి.

- రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు

లైనింగ్... ప్రభుత్వ నిర్ణయం



హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం ప్రభుత్వ విధాన నిర్ణయం. దీన్ని ప్రభుత్వ అధికారులుగా అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే హంద్రీనీవా కాలువ కాంక్రీట్ లైనింగ్‌పై రైతులు, ప్రజలకు ఉన్న అపోహలకు వివరణ ఇస్తున్నాం. భూగర్భజలాలు తగ్గిపోతాయనేది ఒట్టి అపోహమాత్రమే. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. జిల్లాలో 190కిలోమీటర్లు మాత్రమే హంద్రీనీవా లైనింగ్ చేపడుతున్నాం. జీడిపల్లి నుంచి ఫేజ్-2 కింద 216కిలోమీటరు నుంచి కదిరి 400కిలోమీటర్ వరకు లైనింగ్ పనులు జరుగుతాయి. జిల్లాలో హంద్రీనీవా కింద చేపట్టిన పనులన్నీ పూర్తి చేస్తాం.

- నాగరాజ, జలవనరుల శాఖ ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్

మహిళలే ఎక్కువ..!

జిల్లాలో ఓటర్ల సంఖ్య

20,22,229

పురుషులు: 9,99,357
మహిళలు: 10,22,625
ఇతరులు: 247

జాబితా విడుదల చేసిన కలెక్టర్

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
రాయదుర్గం	1,30,549	1,33,528	44	2,64,121
ఉరవకొండ	1,10,832	1,14,075	28	2,24,935
గుంతకల్లు	1,33,230	1,38,158	74	2,71,462
తాడిపత్రి	1,23,466	1,25,558	26	2,49,050
శింగనమల	1,23,321	1,24,779	29	2,48,129
అనంతపురం	1,37,824	1,43,741	28	2,81,593
కళ్యాణదుర్గం	1,14,834	1,16,976	07	2,31,817
రాప్తాడు	1,25,301	1,25,810	11	2,51,122



అనంతపురం: మే 13.. పోలింగ్ రోజున క్యూలో భారీగా మహిళలు (ఫైల్)

అనంతపురం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల జాబితాను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఏడాది నుంచి మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలోని రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 20,22,229 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో పురుషులు 9,99,357 మంది, మహిళలు 10,22,625 మంది, ఇతర ఓటర్లు 247 మంది ఉన్నారు. ఈ జాబితాను అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ప్రదర్శించాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు.

మహిళలే అధికం

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 23,268 మంది ఎక్కువగా ఉన్నారు. అత్యధికంగా అనంత అర్బన్‌లో 5,917 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఆ తరువాతి స్థానాల్లో గుంతకల్లులో 4,928 మంది, రాయదుర్గంలో 3,979 మంది అధికంగా ఉన్నారు.

హమ్మయ్యా.. బతికిపోయా..!



స్టేషన్‌లో దున్నపోతు

అనంతపురం క్రైం/కూడేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేవర దున్నపోతు వివాదం ఎస్పీ కార్యాలయం వరకూ వెళ్లింది. దీంతో రెండూళ్ల మధ్య నలిగిపోతున్న దున్నపోతు బతికిపోయింది. కడదరకుంటలో ఈ నెల 20, 21 తేదీలలో, ముద్దలాపురంలో 21, 22 తేదీలో గ్రామ దేవర ఉంది. ఈ నేపథ్యంలో రెండూళ్ల ప్రజలు అమ్మవార్లకు దున్నపోతులను వదిలారు. ఇందులో ఒకటి మాయంకాగా, ఉన్న ఒక్కదాని కోసం రెండూళ్ల ప్రజల మధ్య వివాదం ఏర్పడింది. ఆ ఒక్కటీ తమదేనని కడదరకుంట గ్రామస్థులు బంధించారు. ఈ వివాదం పోలీసుల వద్దకు చేరింది. అక్కడ పరిష్కారం లభించకపోవడంతో వివాదాన్ని ముద్దలాపురం ప్రజలు సోమవారం ఎస్పీ కార్యాలయం వరకూ తెచ్చారు. డీపీఓ వద్ద బైఠాయించారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుకు సర్పంచ్ ధనుంజయ తదితరులు వినతిపత్రం అందజేశారు. వివాదాన్ని అక్కడే పరిష్కరించనందుకు ఉన్నతాధికారులు అక్షింతలు వేయడంతో కూడేరు పోలీసులు దున్నపోతును స్వాధీనం చేసుకున్నారు. కూడేరు పోలీస్ స్టేషన్‌లో ముద్దలాపురం, కడదరకుంట గ్రామస్థులతో సీఐ రాజు చర్చించారు. దున్నపోతును ఇవ్వడం కుదరదని, స్టేషన్‌లోనే ఉంటుందని రెండూళ్లవారికీ స్పష్టం చేశారు. దీంతో వివాదం సమసిపోయినట్లేనని భావిస్తున్నారు.

ఫారిన్ లాంగ్వేజ్‌తో ఉపాధి అవకాశాలు


ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విదేశీ భాషా నైపుణ్యాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ-ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహించిన ఫారిన్ లాంగ్వేజెస్ ఆన్‌లైన్ కోర్సు ఫలితాలను సోమవారం వీసీ చాంబర్‌లో విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ నుంచి జర్మన్ 45, స్పానిష్ 42, ఫ్రెంచ్ 46 మొత్తం 133మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరందరూ ఉత్తీర్ణత సాధించారు. ఫారిన్ లాంగ్వేజ్ పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలో, విదేశాలలో కచ్చితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని వీసీ అనిత తెలిపారు. ఆర్డీటీతో కలిసి కోర్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణకుమార్తి, డీన్ నరసింహన్, డైరెక్టర్ రమణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ లోకేశ్వర్లు, సూపరింటెండెంట్ చంద్రారెడ్డి, ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్‌మురళీ, ప్రిన్సిపాల్ గీతాంజలి, జర్మన్ టీచర్ సెశోలియా తదితరులు పాల్గొన్నారు.

చందురుని మించు..

విశాల
గగనతలం నుంచి
జగతికి చైతన్యం
ఒసర్చే దినకరుడు
ప్రశాంత ప్రకృతిలో
మయూఖతంత్రుల
తీవ్రతను వీడి
శీతాకాలపు
చలికి పగలే
వెన్నెల కురిపించే
జాబిల్లిలా
మారాడు.


చంద్రుని వలే ప్రకాశిస్తున్న.. సూర్యుడు

గత కొన్ని రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. బారెడు పొద్దెక్కినా పొగమంచు ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంటోంది. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం ఇంకాస్త ఎక్కువగా ఉంది. అనునిత్యం అరుణ వర్ణంతో ఉదయించే సూర్యుడు మంచు మసుగులో వెండి వెన్నెల పంచే చంద్రుడిలా అగుపిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాడు. ఈ సుందర దృశ్యం బుక్కపట్నం మండలం గసికవారిపల్లిలో సోమవారం ఉదయం అగుపించింది.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

న్యూస్ బాక్స్

సర్టిఫికెట్లు ధ్రువీకరించుకోండి

అనంతపురం విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాలున్న(సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులు తమ ఒరిజినల్ పీహెచ్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలపై స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకం, సీల్ వేయించి కమలానగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 317 మంది విద్యార్థులు ఈ నెల 8,9 తేదీల్లో హాజరై ధ్రువీకరించుకోవాలని ఆయన సూచించారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు, డిసెంబరులో ఎంబీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతోపాటు నాలుగో సెమిస్టర్(ఆర్21) పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంసీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ల(ఆర్17,21) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

స్టడీ తర్వాతే చర్యలు

జిల్లా ఆస్పత్రి ఏఓ మల్లికార్జునరెడ్డి



అనంతపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రి ఏఓ(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా మల్లికార్జున రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంగా పలు వివరాలు వెల్లడించారు. తొలుత ఆస్పత్రిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఆతర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో కొరవడిన పర్యవేక్షణను మీరెలా సరిచేస్తారు?

ఏఓ: మా మాతృశాఖ రెవెన్యూ డిపార్ట్‌మెంట్. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మమ్మల్ని జిల్లా ఆస్పత్రికి ఏఓగా నియమించారు. కొత్తకాబట్టి ముందుగా ఏఏ విభాగాలు ఉన్నాయి. అక్కడ ఎంత మంది పనిచేస్తున్నారో స్టడీ చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిని చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏఓ: తొలుత అన్నివిషయాలు తెలుసుకున్న తర్వాత ఆస్పత్రి నియమ నిబంధనలు అందరూ పాటించేలా సూపరింటెండెంట్‌తో కలిసి తగిన ఆదేశాలు ఇస్తాం. అప్పటికీ మారకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో సమయపాలనను ఎలా సరిచేస్తారు?


ఏఓ: నాతొలి ప్రాధాన్యం నిరంతరం పర్యవేక్షణ చేయడమే. రోజుకు రెండు మూడుసార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తా. అపుడు డ్యూటీలో ఉండాల్సిన వారు ఉన్నారా లేదా అని పరిశీలిస్తాం. ముఖ హాజరు వేసిన వారు డ్యూటీ ముగిసేవరకు ఉండాల్సిందే, అలాఉండకుండా ఎక్కడికో వెళ్లి ఉంటే మాత్రం చర్యలు తప్పవు. మరోవైపు గాడిలో పడటానికి అవసరమైతే మూడుసార్లు హాజరు వేసేలా చూస్తాం

ఆంధ్రజ్యోతి: మీదేమో రెవెన్యూ శాఖ మరి డాక్టర్లతో ఎలా కలిసిపోతారు?

ఏఓ: మాది రెవెన్యూ శాఖ అయినా ప్రభుత్వం మాకు ఈ పెద్ద బాధ్యతలు అప్పగించింది. అలాంటపుడు ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది, అందరితో సఖ్యతగా ఉంటూనే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతియంత్రం, పరికరం వినియోగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

అంత సీన్ లేదు..!

హెచ్‌ఎంపీవీకి భయపడొద్దు
సాధారణ ఫ్లూ లక్షణాలే ఉంటాయి
జాగ్రత్తలు పాటిస్తే నయమౌతుంది
డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి
మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంక



అనంతపురం టౌన్/హిందూపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కొవిడ్ తరువాత ఎక్కడ ఏ వైరస్ వచ్చినా విపరీతమైన చర్చ జరుగుతోంది. దాని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, అది హానికరమా కాదా..? వైద్యం అందుబాటులో ఉందా..? వైరస్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..? ఇలా అనేక చర్చలు జరుగుతుంటాయి. తాజాగా చైనాలో ప్రబలుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) గురించి అలాంటి చర్చే జరుగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రజలు ఎక్కువగా వెళ్లి వచ్చే బెంగళూరు నగరంలో ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకిందని తెలియగానే ఒక రకమైన కలకలం రేగింది. కానీ ఇదేమీ కొత్త వైరస్ కాదని, పెద్ద ప్రమాదకారి కూడా కాదని వైద్య నిపుణులు అంటున్నారు. దీనికి ప్రత్యేక వైద్యం అంటూ ఏమీ లేదని, అందుబాటులో ఉన్న సాధారణ వైద్యంతోనే నయమౌతుందని కూడా భరోసా ఇస్తున్నారు. బెంగళూరులో రెండు కేసులు నమోదైనట్లు తెలిసేలోగానే బాధిత చిన్నారుల్లో ఒకరు కోలుకోవడం.. ఈ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తోంది. అయితే, వ్యాధి ఏదైనా నిర్లక్ష్యం చేయకూడదు. సొంత వైద్యాన్ని మానేసి.. వైద్య నిపుణులను సంప్రదించాలి. వారి సూచనలకు అనుగుణంగానే ఔషధాలను వాడాలి. లేదంటే ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందులోనూ హెఎంపీవీ శ్వాసకోశ సంబంధిత సమస్యలను తెస్తుంది. బ్రాంకైటిస్, ఆస్తమా వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది అదనపు సమస్య అవుతుంది. కాబట్టి.. జాగ్రత్తలు పాటించడం, చికిత్స చేయించుకోవడం తప్పనిసరి.

ఇవీ.. లక్షణాలు

హ్యూమన్ మెటానిమో వైరస్ సోకినవారికి సాధారణ ఫ్లూ లక్షణాలు ఉంటాయి. తరచూ జ్వరం వస్తుంది. నీరసంగా ఉంటారు. జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కులో నీరుకారడం, గొంతునొప్పి వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ సోకితే నిమోనియా, ఆస్తమాకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.

ఏం చేయాలి..?

హెచ్‌ఎంపీవీ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు అంటున్నారు. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. కొవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని అంటున్నారు. ఈ వైరస్ సోకకుండా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. రద్దీగా ఉండే ప్రదేశాలకు అవసరమైతే తప్ప వెళ్లకూడదు. దగ్గినపుడు, తుమ్మినపుడు చేతి రుమాలును అడ్డుపెట్టుకోవాలి. అకస్మాత్తుగా తుమ్ములు వస్తే.. అరచేతిని కాకుండా, చేయి మడిచి.. మోచేతిప్రాంతాన్ని అడ్డుపెట్టుకోవాలి. ఈ పద్ధతిని కొవిడ్ సమయంలో వైద్య నిపుణులు సూచించారు. వైరస్ సోకిన లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి. బయట తిరగకుండా, ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకోవాలి. లక్షణాలు ఉన్నవ్యక్తులు వాడిన వస్తువులను ఇతరులు వాడకూడదు.

భయపడాల్సిన పనిలేదు



హెచ్‌ఎంపీవీ వైరస్‌తో పెద్దగా భయపడాల్సిన పనిలేదు. ఈ వ్యాధి ఇంతకు ముందు కూడా ఉంది. చైనాలో ఇటీవల ఎక్కువగా ఉందనే వార్త ఆ నోట ఈ నోట వెలువడటంతో ప్రజల్లో భయందోళనలు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల చలి పెరగడంతో కాస్త జలుబు, దగ్గు, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి భయపడాల్సిన పనిలేదు. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. చిన్న పిల్లలను చలి నుంచి కాపాడుకుంటూ ఉన్ని దుస్తులు ధరింపజేయాలి.

-శివకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, హిందూపురం

జాగ్రత్తలే రక్ష..



హెచ్‌ఎంపీవీ వైరస్ ప్రభావం పెద్దగా లేదు. జిల్లాలో ఆ వైరస్ కేసులు నమోదు కాలేదు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. హెచ్‌ఎంపీ బాధితులకు నిర్దిష్టమైన చికిత్స లేదు, వ్యాక్సిన్ కూడా లేదు. ఇది సాధారణ ఫ్లూ మాత్రమే. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైరస్ గురించి ఆలోచిస్తున్నాయి. పై నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా జిల్లాలో జాగ్రత్తలు తీసుకుంటాము. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ

అంత డేంజర్‌కాదు..



హెచ్‌ఎంపీవీ వైరస్ కరోనా కన్నా పెద్ద ప్రమాదకరమైనది కాదు. ఈ వైరస్ సోకితే సాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఇది అంటువ్యాధి. కాబట్టి కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే ఇప్పుడూ తీసుకుంటే సరిపోతుంది. ఈ కేసుల నిర్ధారణకు ఇంకా ఎలాంటి సూచనలు, నిబంధనలు రాలేదు.

- డాక్టరు ప్రియాంక, మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్, మెడికల్ కళాశాల

19న గిరిజన ఆదివాసీ సమ్మేళనం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గిరిజన ఆదివాసీ సమ్మేళన సభను విజయవాడలో నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. సమ్మేళనసభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ నిర్వహిస్తామన్నారు. గిరిజనుల జీవన శైలి, సమస్యలు, ఆధునిక జీవన పురోగతి, పరిష్కారమార్గాలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు, సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్, కేరళ ఐజీ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాం, బెంగళూరు ఎర్రా భాస్కర్‌నాయక్ తదితరులు హాజరవుతారన్నారు. పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ రవిరాజ్, జీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసునాయక్, సలహాదారుడు నారాయణస్వామి నాయక్, జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, రాయలసీమ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో అనంత బాలోత్సవాలు: డీఈఓ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14, 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన అనంత పిల్లల పండుగ-5 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నిత్యం చదువులు, మార్కుల వేటలో సతమతమయ్యే విద్యార్థులకు సృజనాత్మకత, కళానైపుణ్యం వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవంలో భాగంగా అకాడమిక్, కల్చరల్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి మొత్తం 62 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. వేడుకలకు కవులు, మేధావులు, విద్యావంతులు హాజరై విద్యార్థులను ఉత్తేజపరచాలని కోరారు. బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్, డీఈఓ కార్యాలయ ఏడీ ఆదినారాయణ, బాలోత్సవ కమిటీ నాయకులు ఎల్ఆర్ రమణ, పరమేష్, చంద్రిక, అశ్విని, సురేష్, సిద్దు, గిరి, భీమేష్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. యాడుండారు?

పత్తాలేని వ్యవసాయాధికారి
సమస్యలతో రైతుల ఇబ్బందులు
ఆందోళన చేసినా తీరుమార్చుకోని ఏఓ



డి.హీరేహాళ్ వ్యవసాయశాఖ కార్యాలయం

డి.హీరేహాళ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి కృష్ణకిషోర్‌రెడ్డి తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈయన నెలల తరబడి కార్యాలయానికి రాకుండా, విధుల్లో అలసత్వం చూపుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కనీసం ఫోన్‌లో కూడా ఈయన దొరకడని రైతులు వాపోతున్నారు. మండలంలో 30కిపైగా గ్రామాలు కలిగి ఉన్నాయి. ఈ గ్రామాల్లో 80 శాతానికిపైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయానికి వస్తారు. కానీ ఇక్కడ వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా వ్యవసాయాధికారి కృష్ణ కిషోర్ రెడ్డిని మండలంలో 50 శాత మంది రైతులు కూడా చూడలేదు. మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం తలుపులు నెలలో ఒక్కసారి కూడా తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అధికారి కొన్నేళ్లుగా గ్రీవెన్స్‌లో గాని, మండల సమావేశంలోగాని పాల్గొనడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు సైతం ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. రైతులు, ప్రజాసంఘాల నాయకులు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించినా ఆ అధికారి తీరులో మార్పు లేదు.

చర్యలు తీసుకోవాలి



నేను మురడి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నా. ప్రజాప్రతినిధిగా వ్యవసాయానికి సంబంధించి ఏవైనా సమస్యల కోసం వెళితే అవి పరిష్కారం కావు. ఎందుకంటే ఆఫీసులో మండల వ్యవసాయాధికారు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. నెలల తరబడి మాలాంటి ప్రజాప్రతినిధులకు కూడా ఆయన అందుబాటులో లేకపోతే ఇక రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఉన్నతాధికారులు ఈయనపై చర్యలు చేపట్టి కొత్త వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నాం.

- గంగాధర, ఎంపీటీసీ, మురడి

విచారించి, చర్యలు చేపడతాం

వారంలో ఒకరోజు తప్ప ప్రతినిత్యం అక్కడ అధికారి రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే. ప్రతి రోజూ ఒక సచివాలయాన్ని సందర్శించి అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకుడితో చర్చించి, రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే త్వరితిగతిన పరిష్కరించాలి. అయితే ఇక్కడ వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండటం లేదన్న విషయం ఈ మధ్యనే మా దృష్టికి వచ్చింది. ఎవరైనా రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మణ్‌నాయక్, ఏడీఏ

మా సమస్యలు పరిష్కరించేదెవరు?



మండలంలో రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే అధికారే లేకుండా పోయారు. అసలు మండలంలో వ్యవసాయాధికారి ఉన్నాడో లేడో కూడా అర్థం కావడం లేదు. నేను 40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. గతంలో సేద్యంలో ఎవైనా సమస్యలు వస్తే అధికారులను సంప్రదించేవాళ్లం. అధికారులు కూడా నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేవారు. కానీ ఈయన విధులలో చేరినప్పటి నుంచి నేటి వరకు ఎప్పుడైనా ఫోన్‌లో మాట్లాడటం తప్ప కనిపించిన దాఖలాలు లేవు. అందుకే అసలు మండల వ్యవసాయ కార్యాలయానికి రావడమే మానేశాం.

- ఎర్రిస్వామిరెడ్డి, రైతు, చెర్లోపల్లి

మేకను ఎత్తుకెళ్లిన చిరుత

ధర్మవరం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ పరిధి రేకులమాను ప్రాంతంలో మేకను సోమవారం చిరుత ఎత్తుకెళ్లింది. మేకల యాజమాని గొల్ల నారాయణస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి తనకున్న 50 మేకలను మేపు కోసం ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామ పొలాల్లోకి తోలుకెళ్లాడు. మేకలు మేస్తుండగా అతడు సమీపంలోని గుట్టమీద కూర్చున్నాడు. ఉన్నఫలంగా మేకలు అరవడంతో కిందికి దిగి చూశాడు. ఓ మేకను చిరుత నోటికి కరిపించుకుని ఈడ్చుకెళ్లడం చూశాడు. దీంతో భయాందోళనకు లోనై మేకలను పక్కకు తోలుకొచ్చాడు. మేకను చిరుత ఎత్తుకెళ్లడంతో రూ.10వేలు నష్టపోయినట్లు నారాయణ స్వామి ఆవేదన చెందాడు. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు భయాందోళనకు లోనవుతున్నారు.

45 గొర్రెపిల్లల మృతి


గొర్రె పిల్లల కళేబరాలను చూపుతున్న కాపరి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో చిరుతపులి దాడిలో 45 గొర్రెపిల్లలు సోమవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన కాపరులు ము త్తప్ప, బొమ్మయ్య, గంగాధరలు అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉన్న ముత్తప్ప తోటలో గొర్రెల మందను తోలారు. ఉదయం పిల్లలను అక్కడే వదిలేసి గొర్రెలను మేపేందుకు అడవికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో చిరుతపులి దాడి చేసి దాదాపు 45 గొర్రె పిల్లలను చంపింది. మరో పది గొర్రెపిల్లల పరిస్థితి విషమంగా ఉందని కాపరులు చెప్పారు. సుమారు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు వాపోయారు. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికలకు అధికారి(ఆర్వో)గా వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి వ్యవహరించారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ(రాయదుర్గం), ఉపాధ్యక్షుడిగా రామచంద్ర(అనంతపురం), కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి(అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శశాంకమౌళి ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా ఈశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా జ్యోత్స్న, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్యాంప్రసాద్, శివశంకర్, బృంద, జమీల, బీబీ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.


ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గంగపుత్రులుగా పిలువబడే బెస్త కులస్థులు రాజకీయ, ఆర్థిక, విద్య అన్ని రంగాలలో రాణించాలని బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమంలో సోమవారం బెస్తకులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్తలను రాజకీయ పార్టీలు ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. అనేక సమస్యలు, పేదరికంతో బాధపడుతున్న బెస్తలను అన్ని రాజకీయ పార్టీలు సముచితస్థానం కల్పించి ఆదుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జోక్యం చేసుకుని సున్న పుగుట్ట దురాక్రమణ కాకుండా శ్మశానవాటికగానే బెస్తలకు అప్పగించాలని తీర్మానించామన్నారు. బెస్తలకు కులదైవమైన గంగమ్మ దేవాలయానికి స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు.

కమిటీ ఏర్పాటు

గౌరవ అధ్యక్షురాలిగా కమలమ్మ, అధ్యక్షుడిగా గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా పవన్‌స్వామి, కార్యదర్శిగా నాగరాజు, కమిటీ సభ్యులుగా మహేశ్వర్, రాజు, మీ సేవ నాగేంద్ర, ఆర్టీసీ నాగరాజు, టీచర్ ఎర్రిస్వామి, శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు

ఎప్పుడు వస్తారో.. పోతారో..?

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- యూరాలజీ డాక్టర్ డుమ్మాకొట్టినా.. హాజరు
- విచారణలో కప్పిపెట్టే యత్నాలు.. చివరికి సరెండర్
- జేసీ తనిఖీల్లోనూ అడ్రస్ లేని వైద్యులు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల తీరుపై విమర్శలు

అనంతపురం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి జిల్లాకు వరం. గతంలో న్యూరో, కార్డియాలజీ, కిడ్నీ వంటి వ్యాధులతో జిల్లా ఆసుపత్రికి వస్తే కర్నూలు, బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్‌కు రెఫర్ చేసే వాళ్లు. ఇపుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రావడంతో కీలకమైన వ్యాధులన్నింటికీ ఇక్కడ ఉచితంగానే సేవలు అందుతున్నాయి. కానీ ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.


సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

● మధ్యాహ్నం దాటితే అంతే..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. ముఖ హాజరు కూడా నిత్యం వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు వైద్యులు 10 నుంచి 10-30 గంటలకు వస్తున్నారు. అప్పటివరకు రోగులు వైద్యుల కోసం పడిగాపులుకాస్తున్నారు. ఇక ఇన్‌పేషెంట్ల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. డాక్టర్లు మధ్యాహ్నానికే వెళ్లి పోతున్నారు. ఆ సమయంలో ఎంబీబీఎస్ డాక్టర్లే దిక్కుగా మారుతున్నారు. ఒకటిరెండు సందర్భాల్లో సీరియస్ పేషెంట్లు ప్రాణాలు కోల్పోయినట్లు కూడా ప్రచారం ఉంది.


ఇటీవల సూపర్ స్పెషాలిటీలో ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ శివనారాయణశర్మ

● అంతా కుమ్మక్కు..

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓ విచిత్రమైన వ్యవహారం సాగుతోంది. ఇక్కడ పనిచేసే పర్యవేక్షకుల నుంచి డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులు అంతా ఒక్కటై సాగుతున్నారు. ఐక్యతగా ఉండడం మంచిదే.. కానీ ఇక్కడ జరిగే ఏ లోటుపాట్లు బయటకు రాకుండా ఉండేందుకు ఇలా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఓ యురాలజీ డాక్టర్ డ్యూటీకి రాకున్నా కొన్నినెలలు పాటు జీతాలు చెల్లిస్తూ వచ్చారు. ఆ విషయం బయటకు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ విచారణలోను సంబంధిత పర్యవేక్షకులు, వైద్యులు విచారణ కమిటీకి ఆ డాక్టర్ డ్యూటీకి వస్తున్నారని, పైగా మంచిగా సేవలు అందిస్తున్నారని నివేదిక ఇచ్చారు. నివేదిక తర్వాత జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలోను ఆ డాక్టరు డ్యూటీలో కనిపించలేదని, ఎక్కడా ఆ డాక్టరు పిలిపించమన్నా ఇదిగో.. అదిగో వస్తున్నాడని చెప్పి తప్పించినట్లు వైద్య వర్గాల్లో చర్చ సాగుతోంది. చివరకు ఆ డాక్టర్‌ను డీఎంఈకి సరెండర్ చేశారు.

● జేసీ వెళ్లినప్పుడూ కనిపించని వైద్యులు

జాయింట్ కలెక్టర్ శివనారాయణస్వామి శుక్రవారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలోను డిప్యూటీ సూపరింటెండెంట్ గానీ, వైద్యులు గానీ కనిపించలేదు. చివరికి కార్డియాలజీ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన జేసీ వెంట తిరుగుతూ ఆసుపత్రి విభాగాలను చూపించారు. అప్పుడు కూడా డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు ఎక్కడ అని జేసీ ఆరా తీయగా.. ఏవో కారణాలు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌స్పెషాలిటీకి స్పెషలిస్ట్ డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఆ సమయంలోనే నిబంధనల ప్రకారం ఇక్కడ పనిచేసే డాక్టర్లు ప్రైవేట్ ఆసుపత్రులు నడపకూడదని, అందుకుగాను కొంత మొత్తం జీతం పెంచి ఇస్తున్నట్లు ప్రభుత్వం షరతు విధించినట్లు వైద్య వర్గాలు అంటున్నాయి. కానీ, చాలామంది డాక్టర్లు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు నడుపుకుంటూ సూపర్‌స్పెషాలిటీకి సమయ పాలన పాటించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

● ప్రత్యేక దృష్టి పెడతాం



సూపర్ స్పెషాలిటీలో రోగులకు మంచిగా వైద్య సేవలందిస్తున్నాం. అనేక మందికి కీలకమైన ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడాం. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంపైనా ప్రత్యేక దృష్టిపెట్టి పర్యవేక్షణ చేస్తాం. ఇటీవల ఓ డాక్టరుపై ఆరోపణలు రావడంతో ఆయనను సరెండర్ చేశాం. వచ్చిన ఆరోపణలపైనా విచారిస్తాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

క్రైం కార్నర్

యువతి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మమత

గుంతకల్లు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31 వేడుకలలో చిన్నపాటి వివాదం తలెత్తింది. అది గొడవకు దారితీసి.. ఎ స్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాకా వెళ్లింది. ఇది తన పెళ్లికి అడ్డంకిగా మారుతుందన్న భయంలో గుంతకల్లు సీఐటీయూ కాలనీకి చెందిన బండి మమత సోమవారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు, మమత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు, డిసెంబరు 31వ తేదీ ఉదయం కాలనీలోని సుంకలమ్మ ఆలయం వద్ద సినిమా పాటలు పెట్టారు. దీన్ని ఆ కాలనీకి చెందిన సప్లయర్ సూరి అనే వ్యక్తి ప్రశ్నించాడు. చిన్నారులు అడిగితే తానే పెట్టానని మమత చెప్పడంతో సూరి ఆమెను దూషించాడు. వివాదం చెలరేగడంతో కాలనీ పెద్ద మనుషులు జోక్యం చేసుకున్నారు. సూరితో క్షమాపణలు చెప్పిస్తామని మమతకు నచ్చజెప్పారు. కానీ క్షమాపణలు చెప్పించకపోవడంతో ఈ నెల 4న మమత నేరుగా సూరి ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. సూరి భార్యతో వాగ్వాదం పెరిగి.. ఇరువురు దాడి చేసుకున్నారు. తమను కులం పేరుతో దూషించారని సూరి, అతని భార్య, కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మమత, ఆమె కుటుంబ సభ్యులు, బంధువులపై ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. వచ్చే నెలలో మమత పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేసు కారణంగా పెళ్లి జరుగుతుందో లేదోనని ఆందోళన చెందిన మమత, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఉదయం విషం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

వృద్ధురాలి హత్య

● టీచర్స్ కాలనీలో దారుణం


సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని టీచర్స్‌కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న పొమ్మల సావిత్రమ్మ(63)ను గొంతుకోసి హత్య చేశారు. ఈ హత్య సోమవారం మధ్యాహ్నం 1.30గంటల నుంచి 4గంటల మధ్యలో జరిగి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. సావిత్రమ్మ భర్త ఓబులేసు అటవీశాఖలో రిటైర్డ్ అయ్యారు. కొన్నేళ్ల కిందటే ఆయన మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్దకుమారుడు విజయ్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ప్రస్తుతం తన కుటుంబంతో కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. రెండో కుమారుడు జయకుమార్, కుమార్తె పూర్ణిమ అమెరికాలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ సోమవారం తన తల్లికి భోజనం క్యారియర్ ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేయడానికి పనిమనిషి రమణమ్మ వచ్చింది. ఎంతసేపు పిలిచినా సావిత్రమ్మ పలకలేదు. దీంతో అడ్డంగా వేసిన డోర్‌ను తెరిచి లోపలికి వెళ్లింది. అక్కడ రక్తపు మడుగులో ఉన్న సావిత్రమ్మను చూసి, వెంటనే విషయాన్ని పెద్దకుమారుడికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో విజయ్‌కుమార్ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సావిత్రమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసినట్లు చెబుతున్నారు. 2015లో ఆమె ఆ పోస్టుకు రిజైన్ చేసినట్లు సమాచారం.

తెలిసిన వారి పనేనా...?

సావిత్రమ్మ మెడపై పదునైన ఆయుధంతో కోసినట్లు కనిపిస్తోంది. ఆమె మెడలోని బంగారు గొలుసును మాత్రమే లాక్కెళ్లినట్లు తెలుస్తోంది. ఆమె చేతికున్న బంగారు గాజులు, చెవికున్న జుంకీలు అలాగే ఉన్నాయి. ఇంట్లోని బీరువాను పగులకొట్టిన ఆనవాళ్లు కనిపించలేదు. ఈ కోణంలో ఆలోచిస్తే దొంగలు పని కాదని తెలుస్తోంది. ఆ కుటుంబానికి లేదా ఆమెకు తెలిసిన వారే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే అనుమానం వ్యక్తమవుతోంది. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ల ద్వారా విచారణ ప్రారంభించారు. హత్యకు సంబంధించిన సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ సాయినాథ్ తెలిపారు.

తాడిపత్రి సబ్ డివిజన్‌లోకి పుట్లూరు, యల్లనూరు

పుట్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న పుట్లూరు, యల్లనూరు మండలాలు తిరిగి తాడిపత్రి సబ్ డివిజన్‌లోకి చేరుస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. నాలుగేళ్ల కిందట ఈ మండలాలను అనంతపురం రూరల్ సబ్ డివిజన్‌లోకి మార్చారు. దీంతో సమస్యలపై ఈ రెండు మండలాల నాయకులు, ప్రజలు అవసరాలపై అనంతపురం వెళ్లలేక ఇబ్బందిపడేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ప్రజా ప్రతినిధులకు విషయం చెప్పడంతో వారు ఉన్నతాధికారులతో మాట్లాడి తిరిగి తాడిపత్రిలోకి మార్పు చేయించినట్లు తెలిసింది.

ఉద్యోగాలకు 228 మంది ఎంపిక

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 228మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్‌లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. నైపుణ్యాలను, సామర్థ్యాలను అంచనా వేసేందుకు పోటీ పరీక్షలు, ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారని తెలిపారు. ఈ ప్రక్రియలో మెకానికల్ ఇంజనీరింగ్ 75, ఆటోమొబైల్ 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 75, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 67 మొత్తం 228మంది విద్యార్థులు ప్రతిభను కనబర్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. నెలకు రూ.18500 వేతనంతోపాటు రూ.1500 హాజరు బోనస్, రూ.12వేలు వార్షిక బోనస్ చెల్లిస్తారని తెలిపారు. ఉచిత రవాణా, భోజన సౌకర్యాన్ని కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఓవియా, ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, విభాగాధిపతులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 767 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 448 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

● రైతుసంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

● కలెక్టరేట్ ఎదుట టమోటాలు పోసి రైతుల ధర్నా



కలెక్టరేట్ ముందు టమోటాలు పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టరేట్ ముందు టమోటాలు పోసి నిరసన తెలిపారు. జిల్లాలో దాదాపు 23 వేల హెక్టార్లలో టమోటా సాగు చేశారని, ప్రభుత్వ మార్కెట్ సౌకర్యం లేక ప్రైవేట్ మార్కెట్లలో తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ నీరున్నా, డ్రిప్ పరికరాలతో ఎన్నో ఇబ్బందుల నడుమ పంటను సాగు చేస్తున్నారని, తీరా మార్కెట్‌కు వచ్చాక గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని, దీంతో రైతులు పొలాల్లోనే పంటను వదిలేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మార్కెట్‌కు తెచ్చినా.. నో సేల్ అనడంతో వదిలేసి వెళుతున్నారని అన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, టమోటా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి.. నామమాత్రంగా కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లాలో ప్రభుత్వం తరఫున టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి, రైతులకు పరిష్కారం చూపాలని కోరారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, రైతులు పోతులయ్య, సుబ్బిరెడ్డి, నాగార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, రవినారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవితేజ, వెంకట్రామిరెడ్డి, పరమేష్, సుధాకర్, రామలింగారెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా ఆర్‌ఎస్కేలు..!

- సచివాలయాల్లో సిబ్బంది సేవలు
- అక్కడే పంటల నమోదు
- కనిపించని రాయితీ యంత్ర పరికరాలు


నంబులపూలకుంట రైతు సేవా కేంద్రం

నంబులపూలకుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా నిలవాల్సిన రైతు సేవా కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బంది సచివాలయాల్లో పనిచేస్తున్నారు. గత వైసీపీ పాలనలో కొనసాగిన రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) సేవలు రైతులకు పెద్దగా అందింది లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే)గా పేరు మార్చారేకానీ, సేవలు అందలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ సిబ్బంది కనీసం వాటి బోర్డులను కూడా మార్చలేనంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉన్న పేరుతోనే ఇవి కొనసాగుతున్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో వ్యవసాయానికి అనుసంధానంగా ఉన్న విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్ఏ), విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ), విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ (వీఎస్ఏ) సిబ్బంది కొనసాగుతున్నారు. వీరు రైతులు సాగుచేసిన పంట పొలాల్లోకి వెళ్లకుండా సచివాలయంలోనే ఉంటూ.. రైతు ఆధార్‌నెంబర్‌తో పంటల నమోదు చేస్తున్నారు. నంబులపూలకుంట మండల వ్యాప్తంగా పదివేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉంది. ఏడు వేల ఎకరాల్లో ఉలవ, మూడువేల ఎకరాల్లో వేరుశనగ, కంది, టమోట, మామిడి, ఇతర ఉద్యాన పంటలు ఉన్నాయి.

ఆర్‌ఎస్కే సేవలేవీ..?

రైతులు ఏ సీజనల్‌లో ఏ పంటలు సాగుచేయాలి.. వాతావరణం,



వ్యవసాయ ఉత్పత్తుల నిలువ కేంద్రం

మట్టి నమూనాల ఆధారంగా ఏ పంటలు అనుకూలంగా ఉంటాయి.. మంచి దిగుబడితో ఆర్థికంగా నిలదొక్కుకునే పంటలను ఎంపిక చేసి, వాటిని పర్యవేక్షిస్తూ, సూచనలు, సలహాలు అందించాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాలది. సీఎల్ఎస్ (క్రాప్ లైఫ్ సిస్టమ్) యాప్ ద్వారా పంట నమోదు చేసిన తరువాత, పంటలకు ఆశించిన చీడపీడలపై పర్యవేక్షించాలి. అధికమైతే వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పిచికారి చేయాల్సిన మందులు, సూచనలు, సలహాలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. రైతులు నష్టపోకూడదన్న లక్ష్యంతో ప్రత్యేకంగా ఆర్‌ఎస్కే కేంద్రాలు ఏర్పాటుచేసి, ఓ భవనాన్ని కూడా నిర్మించారు. ఇటీవల చాలామంది సచివాలయ సిబ్బంది సెలవుపై వెళ్లడంతో వారి పనులను కూడా ఆర్‌ఎస్కే సిబ్బందితో చేయిస్తున్నారు. కంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలంటే సిబ్బంది ఆర్‌ఎస్కేల్లో అందుబాటులో ఉండడం లేదు.

యంత్ర పరికరాల ఊసేలేదు

రైతులకు సబ్సిడీ రూపంలో అందించే ట్రాక్టర్లు, మడకలు, గొర్రు, గుంటకలు, వరి కోత, నూర్పిడి యంత్రాలు, వేరుశనగ నూర్పిడి, పప్పు యంత్రం, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు, తెల్లపైపులు సబ్సిడీకి అందేవి. గత వైసీపీ పాలనలో అన్ని మరచిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే పైవాటిని అందిస్తారని రైతులు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు. జిప్సం, జింక్ సల్ఫేట్, బోరాన్ బయట కొనుగోలు చేయాలంటే ఎక్కువ ధరలు చెల్లించాల్సి ఉంది. వీటిని కూడా గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. గతంలో టీడీపీ పాలనలో ఉచితంగా జిప్సమ్, మిగిలిన వాటిని ఎక్కువ సబ్సిడీతో అందించేవారు.

వేరుశనగ తడిసి నష్టపోయా



ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంటకు నూర్పిడి సమయంలో వర్షం వచ్చిం ది. నాలుగు ఎకరాలకు 120 మూటల దిగుబడి వచ్చింది. వేరుశనగ కట్టె, కాయలు తడిసిపోయాయి. దీంతో కొనుగోలుచేసేవారు లేరు. 44 కిలోల బస్తాను రూ.1200కు విక్రయించాను. ఆ సమయంలో మార్కెట్ ధర రూ.2,800 నడుస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే ఇంతనష్టం జరిగేదికాదు.

- వెంకటరమణ, నంబులపూలకుంట

ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి



పంట సాగు చేసినప్పటి నుం చి పూర్త య్యే వరకు ఆర్థికంగా ఇబ్బందులు ప డుతున్నాం. ప్ర భుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలి. పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు ఆదుకోవాలి. పరిహారం అందిస్తే తర్వాత పంట సాగుచేసుకోవడానికి కొంత ఊరట లభిస్తుంది.

- నారాయణ, అంబేడ్కర్ నగర్

సిబ్బందిని ఆర్‌ఎస్కేలకే పరిమితం చేయాలి

వ్యవసాయానికి అనుసంధానంగా ఉన్న అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్ సిబ్బంది సేవలను రైతు సేవా కేంద్రాలకే పరిమితం చేయాలి. వీరిని ఇతర పనులకు కేటాయించకూడదు. దీనివల్ల ఈ క్రాప్ బుకింగ్ లక్ష్యాలను పూర్తి చేయలేకపోతున్నాం.

- లోకేశ్వర్‌రెడ్డి, ఏఓ

తేజ ప్రసాద్ కన్నుమూత

● మెడికల్ కాలేజీకి పార్థివ దేహం

● నేడు ప్రెస్‌క్లబ్ నుంచి అంతిమయాత్ర


తేజ ప్రసాద్ (ఫైల్)


అనంతపురం ప్రెస్‌క్లబ్/అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్(66) సోమవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన అసలు పేరు నందినేని దేవ ప్రసాద్. 1995 నుంచి దాదాపు 30 ఏళ్లుగా అనేక మీడియా సంస్థల్లో పనిచేశారు. స్ఫూర్తిదాయకమైన కథనాలు రాశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రవేశించి, తేజ న్యూస్ చానల్ తరఫున సేవలు అందించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయనను తేజ ప్రసాద్, జెమినీ ప్రసాద్ అని పిలుచుకునేవారు. మృదుస్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని నిర్ణయించారు. అనంతపురం నగరంలోని ప్రెస్‌క్లబ్ నుంచి మంగళవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర మొదలవుతుంది.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లాలోని తొలితరం జర్నలిస్టు, జర్నలిజానికి తన జీవితాన్ని అంకితం చేసిన దేవ ప్రసాద్ మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంపాటు మీడియా రంగంలో పనిచేసిన ఆయన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మాజీ మంత్రి, దివంగత పరిటాల రవీంద్రకు అత్యంత సన్నిహితులని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయనకు కుటుంబ సభ్యులు లేకున్నా.. జర్నలిస్టులే కుటుంబమని, ఆయన జ్ఞాపకార్థం చేయాల్సిన పనులకు తమ కుటుంబం సహకరిస్తుందని తెలిపారు.

చీనీ టన్ను రూ. 26 వేలు



అనంతపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26 వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8 వేలు, సరాసరి రూ. 15 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 37 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న పీఎల్ఎన్ మూర్తి

అనంతపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అనంతపురం అర్బన్‌కు చెందిన పీఎల్ఎన్ మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ లోని బీసీ సంక్షేమ భవన్‌లో సోమవారం వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కపట్రాల బొజ్జమ్మ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కార్పొరేషన్ డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు. తన తోటి డైరెక్టర్లతో కలిసి పీఎల్ఎన్ మూర్తి ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, వాల్మీకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు

నార్పల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లికి చెందిన తలారి కళ్లాయప్ప రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కపట్రాళ్ల బుజ్జమ్మ విజయవాడలోని బీసీ సంక్షేమ భవనంలో కార్పొరేషన్ డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు హాజరయ్యారు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్ట ర్లు, టీడీపీ నాయకులు ఎర్రనాగప్ప, పీఎల్ లక్ష్మీనారాయణ, గంగాధర్‌నాయుడు, నాగభూషణం, శివారెడ్డి, నాగేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

పింఛన్ల రీవెరిఫికేషన్

అనంతపురం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదా రుల వివరాలను వైద్య బృందం పరిశీలించింది. వారు సోమవారం మండల అధికారులతో రూరల్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలను ఆరా తీశారు. రుద్రంపేటలో పరిధిలో జరిగిన పింఛన్ల వెరిఫి కేషన్ ప్రక్రియను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివా కర్ మాట్లాడు తూ... కర్నూల్ జిల్లా నుంచి మూడు వైద్య బృందాలు మండలానికి వచ్చాయని తెలిపారు. మండలం పరిధిలో 107మంది రూ.15వేలు తీసుకుంటున్న పింఛన్‌దారులు ఉన్నారన్నారు. వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో విద్యుత్ సమస్యకు చెక్..!

అనంతపురం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని మల్లయ్య కాలనీ, సంతోష్ నగర్, బీసీ కాలనీ, అన్నేఫెర్రర్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యకు స్థానిక ప్రజాప్రతినిధులు పరిష్కారం చూపారు. సర్పంచు శివశంకర్ సోమవారం కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలోనే కొత్తగా 50 వీధి లైట్లను బిగించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, టీడీపీ నాయకులు గుల్జారమ్మ, సుశీలమ్మ, ఓబులేశు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో నూతన రూసా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పా టుచేశారు. సోమవారం రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఇంజనీ రింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, సీడీసీ డీన్ రామ గోపాల్ ప్రారంభించి మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులు నేర్పించేందుకు అధునాతన వర్షన్‌తో కూడిన కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



సంతోష్‌కుమార్ మృతదేహం

బుక్కరాయసముద్రం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడియంపేట గ్రామం వద్ద ఉన్న పాడిపడిన బావిలో ప్రమాదవశాత్తూ పడి సంతోష్‌కుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం నరరంలోని మారుతీనగర్‌కు చెందిన సంతోష్‌కుమార్ సీఆర్‌ఎస్‌ఎఫ్ జవాన్‌గా పనిచేసేవాడు. విధినిర్వహణలో క్రమశిక్షణ రాహిత్యం కింద ఆయనను 2024లో సర్వీసు నుంచి డిస్మస్ చేశారు. దీంతో మానసికంగా కుంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం స్నేహితుడు బాబావలితో కలిసి అనంతపురం నుంచి బుక్కరాయ సముద్రం మండల పరిధిలోని వడియంపేట శివారులో పంట పొలాల వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న పాడిపడిన బావిలో పడిపోయాడు. బాబా వలి వెంటనే 100 డయల్‌కు సమాచారం అందించగా, పోలీసులు రాత్రి 11 గంటల సమయంలో చేరుకుని పరిశీలించారు. అనంతరం సోమవారం ఉదయం అగ్నిమాపక శాఖ సిబ్బందిని రప్పించి సంతోష్ మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. మృతుడికి భార్య గౌతమి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు, ఈసంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కనగానపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రిజ్వాన్ సోమవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు మండలంలోని ముక్తాపురం వద్ద 44వ జాతీయ రహదారిపై సిబ్బందితో కలసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. అనంతపురం నుంచి బెంగళూరు వెళుతున్న వాహనంలో (50కేజీల) 73 ప్యాకెట్ల రేషన్‌బియ్యం దొరికాయని తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ షామీర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసున మోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

'వర్గీకరణ కులగణనలో కుట్రలు'

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ఏడీఏ కూటమి ప్రభుత్వాలు చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో ఉద్దేశపూర్వకంగా కొన్ని వర్గాలు కుట్రలు పన్నాయని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వాపోయారు. ఈ సందర్భంగా సామ్రాట్ మధు, పుల్లన్న, రేఖలకుంట రామాంజినేయులు సోమవారం మాట్లాడుతూ.. మాదిగల శాతాన్ని తక్కుగా చూపించేందుకు బీసీ, ఓసీ, మైనార్టీలుగా కులగణన జాబితాలో చేర్పిస్తున్నారని ఆరోపించారు. కులగణనలో మాదిగలను ఇతర వర్గాల్లో చేర్చకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అధ్వానంగా పాలబావి రోడ్డు



రాప్తాడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి నుంచి పాలబావికి వెళ్లే మట్టి రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం రాళ్లు తేలి గుంతలమయమైంది. దీంతో బండమీదపల్లి నుంచి పాలబావి కి వెళ్లే వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలబావి విద్యార్థులు ప్రతి రోజు బండమీదపల్లి ఉన్నత పాఠశాలకు కాలినడకన వెళ్తారు. రోడ్డు సరిగా లేకపోవడం, బండ మీదపల్లి చెరువు వద్ద బురద నీళ్లలో నడవాల్సి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు గుండా పొలాలకు వెళ్లే రైతులు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లలో వెళ్లేందుకు బురద నీటిలో నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు. ప్రజాప్రతినిధులు స్పందించి బండమీదపల్లి నుంచి పాలబావికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బండమీదపల్లి చెరువు వద్ద అధ్వానంగా ఉన్న పాలబావి రోడ్డు

రహదారిపై వృథా నీటి ప్రవాహం

రాప్తాడు, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు సబ్‌స్టేషన్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద నుంచి వాల్మీకి విగ్రహం వరకు ఇళ్లలోని వ్యర్థపు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. బీసీ కాలనీలో మురగు నీరు ప్రవహించే కాలువలు లేక పోవడంతో ఇళ్ల లోని వ్యర్థపు నీరు, కొళాయిల నుంచి వృథా అయ్యే నీరు రోడ్డుపైనే నిరంతరం ప్రవహిస్తోంది. వ్యర్థపు నీరు ప్రవహించడంతో రోడ్డు అధ్వానంగా తయారవుతోంది. రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చిన్నకదర య్యస్వామి ఆలయానికి ప్రతి శనివారం అనేక మంది భక్తులు వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. రోడ్డుపై వ్యర్థపు నీరు యథేచ్ఛగా ప్రవహిస్తుం డటంతో వాహనదారులు, ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు కాలువలు ఏర్పాటు చేసి, వ్యర్థపు నీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.



వ్యర్థపు నీరు పారుతుండడంతో అధ్వానంగా తయారైన రహదారి

అన్ని చెరువులకు నీరు అందించాల్సిందే..!



గోళ్లపల్లి వద్ద కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిసున్న ఎమ్మెల్యే

- ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం
- పీఏబీఆర్ కుడికాలువలో నీటి ప్రవాహం పరిశీలన

రాప్తాడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ కింద నిర్దేశించిన అన్ని చెరువులకు నీరు అందించాల్సిందేనని ఎమ్మెల్యే పరి టాల సునీత ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండలంలో ని గోళ్లపల్లి సమీపంలో పీఏబీఆర్ కుడి కాలువలో ప్రవహిస్తున్న నీటిని రైతులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ధర్మవరం నియోజకవర్గంలోని చివరి చెరువుకు నీరు అందిస్తున్న నేపథ్యంలో కాలువలో నీటివేగం తగ్గిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రస్తుతం తాడిమర్రి మండలంలోని చివరి చెరువుకు నీరందిస్తున్నారు. అయితే నీటి వేగం తగ్గడంపై అధికారులతో ఆరాతీశారు. ధర్మవరం నియో జకవ ర్గంలోని చెరువులకు వెళ్లే నీటిప్రవాహం తగ్గితే ఇంక రాప్తాడు నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో కుడి కాలువ పరిధిలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాల్సిందేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, రైతులు పాల్గొన్నారు.

పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలపాలి

కనగానపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కరువు బృందం పర్యటించనున్న నేపథ్యంలో పంటనష్ట వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, అందుకు అధికారులు కార్యాలయాలు వదలి పొలాలవైపు చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలంలోని తల్లిమడుగుల గ్రామం లో హంద్రీనీవా కాలువ పరిధిలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. పంట పచ్చగా ఉన్నా తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిందని, కనీసం పెట్టుబడులు వచ్చేట్టు కనిపించడంలేదని రైతులు రామాంజినేయులు, సుబ్బయ్య, సూర్యనారాయణ, సరస్వతి ఎమ్మెల్యేకి వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు అందించాలని ఎమ్మెల్యే తెలిపారు. పంటనష్టాన్ని అధికారులు కరువు బృందానికి తెలిపి రైతులను ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ రామాంజినేయులు, అంజి, మనోహర నాయుడు, ఆనంద్, కిష్టయ్య, ముత్యాలు, అశ్వత్థ తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

- వడ్డెర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కిందని వడ్డెర్ల సంఘం నాయకులు పేర్కొ న్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ వెబ్ సైట్ ఓపెన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ సంఘం నాయకులు లక్ష్మన్న, సుధాకర్, రవి, శేషు తదితరులు పాల్గొన్నారు.

మరవకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలని వినతి

శింగనమల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం-తాడిప్రతి జాతీయ రహదారిలో శింగనమల సమీపంలో మరవకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి శింగనమల గ్రామస్థులు విన్నవించారు. వారు సోమవారం శింగనమలకు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేను కలిశారు. రోడ్డు ప్రణాళిక సమయంలో అధికారులు నిర్లక్ష్యంతో శింగనమలను దృష్టిలో ఉంచుకోలేదని, ఎన్ని సార్లు రోడ్డు పనుల అధికారులకు తెలిపినా స్పందిచలేదన్నారు. .ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి ఏర్పాటు చేయకపోతే శింగనమల గ్రామం కనుమరుగు అవుతుందని కలెక్టర్‌కు తెలిపారు. నాయకులు దండు శ్రీనివాసులు గుత్త ఆదినారాయణ, మాసూల చంద్ర, షాలిని, ఎం ఆదినారాయణ, గార్లదిన్నె సత్యనారాయణ, నాగముని తదితరులు పాల్గొన్నారు....

కాలేజీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అనంతపురం విద్య, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓ కళాశాలపై వెంటనే చర్య తీసుకోవాలని ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పృథ్వి, వీఎన్‌ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఇతర నాయకులు సోమవారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. ఆ కళాశాలలో సిబ్బంది విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆ విద్యాసంస్థల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుడికి ఘన నివాళి

అనంతపురం విద్య, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్-1938 వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ విశేషంగా సేవలు అందించారని ఏపీటీ ఎఫ్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయభవన్‌లో సోమవారం మార్పు 12వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, ఇతర నాయకులు వెంకటసుబ్బయ్య. మహమ్మద్ రఫీ, వెంకటరెడ్డి, రవీంద్ర ఇతర నేతలు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి

- ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు విలీనమవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఉన్న కొనసాగించాలని ఏపీజీబీ అధికారుల సంఘం నాయకులు కోరారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఏపీజీబీ మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతిపెద్దదన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండడం వలన కడపలోనే కొనసాగించాలని వారు కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ... సీఎం దృష్టికి తీసుకెళ్లి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీజీబీ అధికారుల సంఘం నాయకులు రవితేజ, ప్రకాష్‌నాయుడు, హనుమంత రెడ్డి, రంగస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ యేడే తల్లికి వందనం అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓతూరు పరమేష్ మాట్లాడుతూ...మూడు రోజుల క్రితం క్యాబినెట్ మీటింగ్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరంలో తల్లికి వందనం అమలు చేయకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

తౌసిఫ్‌కు పీఎం అవార్డు



మహ్మద్‌తౌసిఫ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్‌లో పనిచేస్తున్న జిల్లా వాసి మహ్మద్‌తౌసిఫ్ ప్రైమినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా సహకార శాఖలో పనిచేస్తున్న మహ్మద్‌ఇక్బాల్ తనయుడు మహ్మద్ తౌసిఫ్ 2010లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ పూర్తి చేసి అదే ఏడాది ఆగస్టులో బెంగళూరు బీహెచ్‌ఈఎల్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఒక్కోమెట్టు ఎదుగుతూ మేనేజర్ స్థాయికి చేరిన తౌసిఫ్ 2024ఏడాదికి గాను బీహెచ్‌ఈఎల్ ప్రైమినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల జర్మనీలో పర్యటించిన ఆయన రైలు ప్రమాదాల నివారణకు ఉపయోగించే ఇంజన్ ట్రాక్షన్‌పై ప్రత్యేకంగా అధ్యయనం చేసి వచ్చారు. దేశంలో ప్రమాద రహిత ట్రైన్ తయారీకి సాంకేతికతను అందజేయడంలో తౌసిఫ్ బీహెచ్‌ఈఎల్‌లో కీలకంగా పనిచేస్తున్నారు. ఢిల్లీలో మంగళవారం జరిగే బీహెచ్‌ఈఎల్ దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా తౌసిఫ్ అవార్డు అందుకోనున్నారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ

- ఐసీడీఎస్ఐ పీడీ వనజా అక్కమ్మ

గార్లదిన్నె, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల్ భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతోగానో దోహపడుతుందని ఐసీడీఎస్ఐ పీడీ వనజాక్కమ్మ పేర్కొన్నారు. గార్లదిన్నెలో కిశోరి వికాసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ ముఖ్య అతితులుగా హజరైమాట్లాడారు. అడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం పునఃప్రారంభం పునాది వేస్తుందన్నారు. ముఖ్యంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంఈఓ మల్లికార్జుననాయక్, సీడీపీఓ ఉమా శంకరమ్మ, ఏపీఎం మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ మండల కోఆర్డినేటర్ అనురాధ, ఐసీడీఎస్ఐ సూపర్ వైజర్లు జ్యోతి, వాణిశ్రీ, వీఆర్వోలు, వెలుగు సీసీలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కిశోరి వికాసంతో మరింత అభివృద్ధి : సీడీపీఓ

అనంతపురం విద్య, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి మరింత సాధ్యమని అనంతపురం అర్బన్ ప్రాజక్టు సీడీపీఓ లలిత పేర్కొన్నారు. నగర శివారులోని మహిళా ప్రాంగణంలో సోమవారం అర్బన్ ప్రాజక్టు పరిధిలోని 3,4 సెక్టార్లలో అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులు, హెల్త్ సెక్రెటరీలకు కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరై సీడీపీఓ మాట్లాడుతూ... ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ వేదికలపై బాలికలు జాగ్రత్తగా ఉండేట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ వేగంగా చేపట్టండి: కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులు త్వరగా చేపట్టాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. ఆయన సోమ వారం కలెక్టరేట్‌లో భూసేకరణ స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్- 544డి, ఎన్‌హెచ్- 67, ఎన్‌హెచ్-544డీడీ, ఎన్‌హెచ్-42, ఎన్‌హెచ్-150ఎ జాతీయ రహదారులు, పవర్‌గ్రిడ్స్ కార్పొరేషన్, ఏపీట్రాన్స్‌కో, జెన్కో, ఏపీఐఐసీ రైల్వేస్ పనులు చేపట్టడంపై ప్రతిఒక్కరు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మలోల, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్ రియాజుద్దీన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, సర్వే ఏడీ రూపానాయక్, ఎన్‌హెచ్ఏఐపీడీ తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ఉపాధి పనులు చూపాలి

జిల్లాలో లక్ష్యంమేరకు కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు చూపించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఉపాధి పనులపై ఆయన సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. ఉపాధి పనులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలో రాప్తాడు, కూడేరు, విడపనకల్, బుక్కరాయసముద్రంతోపాటు మరికొన్ని మండలాలు ఉపాధి పనుల పురోగతిలో వెనుకబడి ఉన్నాయన్నారు. సీసీరోడ్లు, ఫారంపాండ్స్, హార్వెస్టింగ్‌లో మొదటిస్థానంలో ఉన్నామని, కమ్యూనిటీ సోక్ పిట్స్‌లో తృతీ య స్థానంలో ఉన్నామన్నారు. మిగిలిన పనుల్లో నూ మరింత పురోగతి సాధించాలని సూచించారు. డ్వామా పీడీ సలీమ్ బాషా, హౌసింగ్ పీడీ శైలజ, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లామ్ పాల్గొన్నారు.

పతికి రమేష్‌నారాయణకు సాహితీ పురస్కారం



పతికి రమేష్ నారాయణను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్/ క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంతకు చెందిన సీనియర్ సాహితీవేత్త డాక్టర్ పతికి రమేష్‌నారాయణ విశిష్ట సాహితీ పురస్కారం అందుకున్నారు. 'అవ్వ' కావ్యాన్ని ఆయన 'ది మదర్' పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. ఆ పుస్తకం శరత్ సాహితీ కళా స్రవంతి ఆధ్వర్యంలో విశిష్ట సాహితీ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవంలో రమేష్ నారాయణకు తెలుగు విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య వెలిదండ్ల నిత్యానందరావు, కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య భట్టు సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారం అందజేసి సత్కరించారు. దీనిపై శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, యూనివర్సిటీల విభాగం రాష్ట్ర కన్వీనర్ బత్తల అశోక్‌కుమార్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత సుంకర రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కేఎస్ఎన్ డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల



కాలేజీ టాపర్లు సృజన, సుష్మ, చందన

అనంతపురం సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ పరీక్షా ఫలితాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత విడుదల చేసి మాట్లాడారు. గత నెలలో డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 438 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 390 మంది ఉత్తీర్ణులు కావడంతో ఉత్తీర్ణత శాతం 89గా నమోదైనట్లు తెలిపారు. 9.15 క్రెడిట్లతో సృజన ప్రథమ, 9.08 క్రెడిట్లతో సుష్మ ద్వితీయ, 9.06 క్రెడిట్లతో చందన తృతీయస్థానాల్లో కాలేజ్ టాప ర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఫలితాలను కళాశాల వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ కోసం ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చెన్నేకొత్తపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ, మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ సురేశ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు ముత్యాలప్ప, అమర్‌నాథ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలికల ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్తంగా, ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న నాలుగో ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమ వారం మూడోరోజు కొనసాగాయి. లిబర్టీ లేడీస్ తమిళనాడుపై గుజరాత్ స్పోర్ట్స్ అథారిటీ జట్టు 20గోల్స్ తేడాతో, పెన్నా ఏపీపై నర్మదావ్యాలీ మధ్య ప్రదేశ్ జట్టు 8గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అలాగే నంది ఫౌండేషన్ గుజరాత్‌పై కంపాసిన్ 26గోల్స్ తేడాతో, ఫాల్కన్‌గర్ల్స్ ఒడిశాపై బెంగుళూరు 2 గోల్స్ తేడాతో, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై తమిళనాడు ధామ్ 14గోల్స్ తేడాతో గెలుపొందాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం: ఆలం



మాట్లాడుతున్న ఆలం వెంకటనరసానాయుడు

నార్పల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొందలవాడ గ్రామాన్ని ఆ పంచాయతీ ఉప సర్పంచు ఆలం వెంకట నరసానాయుడు సోమవారం దత్తత తీసుకున్నారు. బొందలవాడ గ్రామంలో 2024-25 సంవత్సరం ఆఖరి గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీపీఆర్సీ కోఆర్డినేటర్ సౌజన్య కుమారి, ఈఓఆర్డీలు శైలజారాణి, మాధవీలత పాల్గొన్నారు. 2025-26 సంవత్సరంలో బొందలవాడ పంచాయతీ సుస్థిర అభివృద్ధిపై ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ ...స్వచ్ఛ గ్రామ పంచాయతీగా మార్చేం దుకు తాను గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో దాదాపీర్, సచివాలయ సిబ్బంది, వార్డ్‌మెంబర్లు, నారాయణస్వామి, బాబు, అనిత, సాగునీటి సంఘం అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

'మాటిచ్చారు... నెరవేర్చారు'



తారు రోడ్డును పరిశీలిస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. మరూరు నుంచి చాపట్లకు 3 కి.మీ. మేర నిర్మిస్తున్న తారురోడ్డు పనులను ఆయన సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామశివారులో ఏడుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో పేకాటాడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1950 ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రాయదుర్గం కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటు

రాయదుర్గంరూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇసుక కర్ణాటకకు తరలకుండా ఉండేందుకు గాను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సరిహద్దులోని గొల్లపల్లి రోడ్డు వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగరాజు సోమవారం తెలిపారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖల నుంచి ఒక్కొక్కరు టీంగా ఏర్పడి ఈ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా ఇక్కడి ఇసుక, మట్టి కర్ణాటకకు తరలకుండా బందోబస్తు చర్యల్లో భాగంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మన ఇసుకను, మట్టిని మన ప్రాంతం వాసులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎవరైనా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ ఫిర్యాదు

విడపనకల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలుగు యానిమేటర్ మమత తనకు తెలియకుండా తన పేరు మీద రూ. లక్షా10వేలను డ్రా చేసిందంటూ లత అనే మహిళ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. తాము 8 ఏళ్లుగా బెంగళూరులో నివాసముంటున్నామని, అయితే సమీప బంధువు అయిన యానిమేటర్ మమత తనకు తెలియకుండా తన వివరాలను సేకరించి పేరును చార్మినార్ మహిళా గ్రూప్‌లోకి ఎక్కించిందన్నారు. తాను విడపనకల్లు కెనరా బ్యాంక్‌లోకి వచ్చి అకౌంట్‌ను పరిశీలించగా నా పేరున రూ.లక్షా10వేలు వెలుగులో రుణం తీ సుకున్నట్లు తేలిందన్నారు. ఈ విషయమై యానిమేటర్ మ మతను నిలదీయగా ఏమీ సంబంధం లేదని దబాయించిందన్నారు. 8ఏళ్లుగా తనకు తెలియ కుండా తన పేరును చా ర్మినార్ గ్రూప్‌లో చేర్చి లావాదేవిలు నడిపిందంటూ ఆవేదన వ్యక్తం చేసింది. గ్రూప్ సభ్యులకు కూడా తెలియకుండా మమత తన సంతకాన్ని ఫోర్జరీ చేసి, బ్యాంక్ అధికారులతో కుమ్మకై డబ్బులు డ్రా చేసిందని ఆమె ఫిర్యాదు చేసింది.

దీనిపై వెలుగు ఏపీఎం వాలానాయక్‌ను వివరణ కోరగా యానిమేటర్ ఫోర్జరీ సంతకంతో డబ్బు డ్రా చేసినట్లు తేలితే చట్టపరమైనచర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇద్దరు ఎంపీఈఓలకు షోకాజ్ నోటీసులు

విడపనకల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరుకు చెందిన ఇద్దరు ఎంపీఈఓలకు సోమవారం వ్యవసాయ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాల్తూరు గ్రామానికి చెందిన ఎంపీఈఓలు రైతు సేవా కేంద్రాన్ని సమయానికి తీయటం లేదని ఆ గ్రామ రైతులు గత శనివారం వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర సోమవారం పాల్తూరు గ్రామం చేరుకుని రైతులను విచారించారు. రైతులు మట్లాడుతూ రోజు మధ్యాహ్నం 12 గంటలైనా రైతు సేవా కేంద్రాన్ని తెరవటం లేదన్నారు. ఒ క్కో రోజు తాళమే తీయకుండా మూసి ఉంచుతారని చె ప్పారు. అలాగే సబ్సిడీ పప్పుశనగ ను గ్రామంలోని కొంత మంది రైతులకు అప్పుగా ఇచ్చారని, వాటి మొత్తం ధర దాదాపుగా రూ. 56వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని అధికారుల విచారణలో తేలింది. దీంతో వెంటనే ఆ ఇద్దరు ఎంపీఈఓలైన మెర్సికి, ముత్యాలుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆలయానికి రూ.5లక్షల వితరణ

గుంతకల్లుటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం సమీపంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శాశ్వత దీప ధూప నైవేద్యాలకు గాను గుంతకల్లు పట్టణానికి చెందిన దేవేంద్రప్ప రూ.5,01,116లక్షలు వితరణ చేశారు. ఆ ఆలయంలోనే సోమవారం ఉదయం ధర్మకర్త తలారి పరుశురాముడుకు నగదును అందించారు. తర్వాత దేవేంద్రప్ప, ఆయన కుటుంబసభ్యుల పేరిట అర్చకులు అర్చనలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

కంబదూరు ఎక్సైజ్‌స్టేషన్ తనిఖీ

కళ్యాణదుర్గం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కంబదూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి మునిస్వామి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నుంచి పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుని త్వరగా విచారణ పూర్తి చేసి చార్జ్‌షీట్లు కోర్టులో వేసి సీసీ నెంబర్లు తీసుకోవాలని సూచించారు. అలాగే కర్ణాటక మద్యంను అమ్మేవారిని, రవాణా చేసేవారిపై నిరంతరం దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని తెలిపారు.

పట్టపగలే చోరీ

తాడిపత్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురంలో గల వెంకటరామిరెడ్డి ఇంటిలో సోమవారం పట్టపగలే చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వెంకటరామిరెడ్డి, ఆయన భార్య శశికళ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. దీంతో వారు విధులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేనిది ఇదే అదునుగా దొంగలు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 5తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నర్సరీల్లో పండ్ల మొక్కల పరిశీలన

కుందుర్పి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి సోషల్ ఫారెస్ట్ నర్సరీలలో పండ్ల మొక్కలను కళ్యాణదుర్గం డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీపిక, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీశంకర్, ఈవోపీఆర్డీ రవీంద్ర సోమవారం పరిశీలించారు. అనంతరం దీపిక మాట్లాడుతూ సోషల్ ఫారెస్ట్ నర్సరీల నుంచి ఉపాధి హామీ కింద ఉద్యానపంటలు సాగు చేసే రైతులకు ఈ మొక్కలు అందజేస్తామని తెలిపారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి, జనవరి6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ కట్ట వద్ద సోమవారం రాత్రి మట్కాబీటర్ మహమ్మద్‌రజాక్‌ను అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి రూ.70వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టే మోడల్ డీఎస్సీ పరీక్ష రాసేందుకు ఈ నెల 12వ తేదీలోపు ఎస్‌జీటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు జ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

బడుగుల అభ్యున్నతికి కృషి చేయండి

● కురుబ, బోయ కార్పొరేషన్ల డైరెక్టర్లకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచన



కురుబ, బోయ కార్పొరేషన్ల డైరెక్టర్లతో ప్రమాణం చేయిస్తున్న కాలవ

రాయదుర్గం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బడుగులైన వాల్మీకి బోయ, కురుబ సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర వాల్మీకి బోయ, కురుబ కార్పొరేషన్ల నూతన డైరెక్టర్లకు ప్రభు త్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లో సోమవారం ఆయన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాయదుర్గానికి చెందిన జనసేన ఇన్‌చార్జి కురుబ మంజునాథ్‌గౌడ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఇతర ప్రాంతాలకు చెందిన పలువురితో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో వాల్మీకి బోయలు, కురుబలు కడు పేదరికంలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు. వారికి సామాజికంగా, రాజ కీయంగా ఆర్థికంగా ఎదగడానికి చేయూతనివ్వాలని పేర్కొన్నారు. వాల్మీకి బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనపై చంద్రబాబునాయకత్వంలోనే గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించా రని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాంతాల వారీగా చిచ్చుపెట్టి ఈ ప్రతిపాదనను తొక్కిపెట్టారని అన్నారు. నేడు కేంద్రంలో, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ బలపరచిన కూటమే అధికారంలో ఉన్నందున ఎస్టీలో చేర్చాలనే న్యాయమైన సమస్యపై తప్పక సానుకూల నిర్ణయం లభించే వీలుందని పేర్కొన్నారు. డీ.హీరేహాళ్ టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

● ముగ్గురు మాత్రమే హాజరు



గ్రీవెన్స్‌కు హాజరైన ముగ్గురు అధికారులు

శెట్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ముచ్చటగా మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అధికారులు డుమ్మా కొట్టారు. ప్రభుత్వం ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌ను నిర్వహిస్తోంది. అయితే ఆ కార్యక్రమానికి తరచూ పలు శాఖల అధికారులు డుమ్మా కొడుతుండడం.. సమస్యలు విన్నవించడానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగి వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ వారం కూడా అలాగే జరగడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత మాత్రానికి ఈ కార్యక్రమం ఎందుకు నిర్వహించాలంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి



దస్తగిరి (ఫైల్)

గుత్తిరూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో గల రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లికి చెందిన దస్తగిరి (37) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా అతను ఓ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. బసినేపల్లి గ్రామాశివారులోకి రాగానే బైకు అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. ఈ సంఘటపై కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

ఉరవకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో 2,24,339మంది ఓటర్లు ఉండగా.. వారిలో మహిళలు 1,13,771 మంది, పురుషులు 1,10,540 మంది ఉన్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా సోమవారం తెలిపారు. ఉరవకొండ మండలంలో 67,921మంది ఓటర్లకు గాను మహిళలు 35,051మంది, పురుషులు 32,862 మంది, ఇతరులు 8మంది ఉన్నారు. వజ్రకరూరు మండలంలో 43,484మందికి గాను మహిళలు 21,841మంది, పురుషులు 21,638మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. విడపనకల్లు మండలంలో 44,227మంది గానూ మహిళలు 22,109మంది, పురుషులు 22,110 మంది, ఇతరులు 8మంది ఉన్నారు. బెళుగుప్ప మండలంలో 36,443 మంది గానూ మహిళలు 18,462మంది, పురుషులు 17,981మంది ఉన్నారు. కూడేరు మండలంలో 32,264 మంది గానూ మహిళలు 16, 308మంది, పురుషులు 15,949మంది, ఇతరులు ఏడుగురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉరవకొండ, వజ్రకరూరు, బెళుగుప్ప, కూడేరు మండలాల్లో మహిళ ఓటర్లే అధికంగా ఉన్నట్లు చెప్పారు.

లాబీ వద్ద రన్నింగ్ స్టాఫ్ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న లోకో రన్నింగ్ స్టాఫ్

గుంతకల్లు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోకో పైలెట్లు, ఇతర లోకో రన్నింగ్ స్టాఫ్ తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జోనల్ కమిటీ పిలుపు మేరకు లోకో పైలెట్లు, సహాయ లోకో పైలెట్లు గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని అన్ని క్రూ కంట్రోల్ లాబీల వద్ద సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. యూనియన్ లోకో రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ రన్నింగ్ స్టాఫ్ టీఏ, డీఏ, ఆర్ఏలను పెంచాలని డిమాండ్ చేశారు. అసంబద్ధ వాదనలతో రన్నింగ్ స్టాఫ్‌ను దగా చేయడం మానుకోవాలన్నారు. డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళనలు ముమ్మరమౌతాయన్నారు. కార్యక్రమంలో రన్నింగ్ బ్రాంచ్ ఏడీఎస్ శ్రీనివాసులు, నాయకులు నరేశ్, రూప్లా నాయక్, జాఫర్ ఖాన్, లోకో పైలెట్లు, సహాయ పైలెట్లు పాల్గొన్నారు.

చురుగ్గా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సర్వే పనులు

యాడికి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలపాడు రెవెన్యూ పంచాయతీలో ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన సర్వే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. సర్వే పనులను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి సోమవారం పర్యవేక్షించారు. సుమారు 874.70ఎకరాల విస్తీర్ణంలో కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి కుందనకోట, కమలపాడు రెవెన్యూ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూములతో పాటు పట్టాభూములను సేకరించారు. ప్రాజెక్ట్ ఏర్పాటు వలన పర్యావరణ కాలుష్యంపై ప్రజాభిప్రాయ సేకరణ గతేడాది పూర్తయింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 950మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. మండలంలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. సర్వేలో పలువురు జెన్‌కో అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైల్వే డీజిల్ షెడ్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ

గుత్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వేడీజిల్ షెడ్‌లో గుత్తికోట సంరక్షణ సమితి ఆధర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీనియర్ డీఎంఈ ప్రమోద్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇందుకు రైల్వే అధికారుల సహకారం అందించాలన్నారు. అదే విధంగా గౌతమేశ్వర ఆలయానికి రహదారి కోసం అండర్‌వే బ్రిడ్జికి బడ్జెట్ కేటాయించేలా చూడాలన్నారు. అలాగే ఎంఎస్ ఉన్నత పాఠశాల వద్ద చెరువు కట్టవైపు రైల్వే ట్రాక్ వద్ద ప్రొటక్షన్ వాల్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి

పుట్లూరు, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగలగూడూరు గ్రామంలో అకాల వర్షాలకు నష్టపోయిన పప్పుశనగ పంట రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని తెలుగుయువత మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో నష్టపరిహారం అందించాలని కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు శివశంకర్‌రెడ్డి, పలువురు గ్రామస్థులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తాడిపత్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీవీఆర్‌టీ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన రంగయ్య పని నిమిత్తం ద్విచక్రవాహనంపై తాడిపత్రికి వచ్చాడు. పని ముగించుకున్నాక స్వగ్రామానికి బయలుదేరాడు. సీవీఆర్‌టీ కళాశాల సమీపంలోకి రాగానే ..ఓ ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

12న మహిళలకు కబడ్డీ పోటీలు

తాడిపత్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పప్పూరురోడ్డులో ఉన్న సౌభాగ్య సింధు ట్రస్ట్ బాలకల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నియోజకవర్గస్థాయి అండర్-19 మహిళలకు కబడ్డీ పోటీలు, ముగ్గులపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రవీంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7330625055, 8919278039కు సంప్రదించాలని కోరారు.

దళితులకు అటవీ భూములను కేటాయించాలి

పెద్దవడుగూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భూమిలేని దళితులకు అటవీ భూములను కేటాయించాలని కోరుతూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ మండలంలో దళితులకు నిరుపయోగంగా ఉన్న అటవీ భూములను కేటాయించి పంటలు సాగుచేసుకొనేందుకు అవసరమైన ఆర్థికసాయం అందించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రంను తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. అటవీ భూములను పంపిణీ చేయడం మా పరిధిలో లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ వారికి సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

ఉరవకొండ, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఐటీఐల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్ కుమార్, దుర్గాప్రసాద్ రాష్ట్ర ఆర్థిక మంత్రి కేశవ్‌ను కోరారు. అమరావతిలో సోమవారం వారు మంత్రినిఈ మేరకు విన్నవించారు. అలాగే టీడీపీ నాయకులు మారయ్య, దేవేంద్రమంత్రిని కలిసి విడపనకల్లు మండలంలోని సమస్యలు విన్నవించారు. పాల్తూరు, హావలిగి గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్‌సమస్య పైన తెలపగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరెడ్డి, కొనకొండ్ల నారాయణస్వామి పాల్గొన్నారు.

హెచ్ఎంపీవీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని 13వ వార్డు 2వ సచివాలయ పరిధిలో సోమవారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్ కరోనా వైరస్ తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి దగ్గినపుడు, తుమ్మినపుడు వెలువడే తుంపర్ల ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఈ వైరస్ సోకినవారికి సాధారణ జలుబు, దగ్గు, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, శ్వాస సంబంధిత సమస్య లు వస్తాయన్నారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, మాస్క్ పెట్టకోవడం చేయాలని సూచించారు. ఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా జేసీ క్రికెట్ టోర్నీ ప్రారంభం

● బ్యాటింగ్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జేసీ క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులకు జేసీ ఫ్యామిలీ నుంచి ఎప్పటికీ ప్రోత్సాహం ఉంటుందన్నారు. గతంలో కూడా క్రీడాకారులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో క్రీడలను పట్టించుకోలేదని వాపోయారు. ఇక నుంచి ప్రతి ఏడాది క్రికెట్ మాత్రమే కాకుండా అన్ని రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. అంతకుమునుపు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మ్యాచ్‌లను తిలకించారు. పట్టణ ప్రజలు కూడా మ్యాచ్‌లను చూస్తు ఎంజాయ్‌చేశారు.

మొదటిరోజు మ్యాచ్‌లు

జేసీ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటిరోజు ఆరుమ్యాచ్‌లు జరిగాయి. వీటిలో మొదట వెంకటలయన్స్ , మస్తాన్ మ్యాక్సీ టీంలు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన వెంకట లయన్స్ జట్టు 8ఓవర్లలో 110పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మస్తాన్ మ్యాక్సీ టీం 8ఓవర్లలో 83పరుగులు చేసింది. 27పరుగుల తేడాతో లయన్స్ టీం గెలిచింది. అనంతరం రెండో మ్యాచ్‌లో ఏడీ వారియర్స్ , లవంగి టీంలు పోటీపడ్డాయి. ఏడీ వారియర్స్ టీం 134పరుగులు చేయగా, లవంగీ టీం 56పరుగులు చేసింది. 78పరుగుల తేడాతో ఏడీ వారియర్స్ గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో విఘ్నేశ్వర లెవెన్, డాకులెవెన్ జట్లు పోటీపడ్డాయి. విఘ్నేశ్వర జట్టు 109పరుగులు సాధించింది. డాకులెవెన్ జట్టు 70పరుగులకు ఆలౌట్ అయింది. 39పరుగుల తేడాతో విఘ్నేశ్వర జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో మల్లేనిపల్లి యూత్, పెద్దవడుగూరు జట్లు పోటీపడ్డాయి. మల్లేనిపల్లి జట్టు 65పరుగులు సాధించింది. పెద్దవడుగూరు జట్టు 69పరుగులు సాధించి విజయం సాధించింది. ఐదో మ్యాచ్‌లో అప్పేచర్ల లెవెల్ , క్రిష్టిపాడు యూత్ జట్లు పోటీపడ్డాయి. అప్పేచర్ల జట్టు 86పరుగులు సాధించగా క్రిష్టిపాడు జట్టు 69పరుగులు సాధించి ఓటమి పాలైంది. 6వ మ్యాచ్‌లో సుధాలెవెన్ , కొమరం పులి జట్లు పోటీపడ్డాయి. సుధాలెవెన్ జట్టు 70పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కొమరం పులి జట్టు 74పరుగులు సాధించి విజయం పొందింది. దీంతో మొదటిరోజు మ్యాచ్‌లు ముగిశాయి.

అమర్యాదగా ప్రవర్తించడం తగదు

కణేకల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండల అధికారి సచివాలయ ఉద్యోగి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం తగదని మండల సచివాలయ ఉద్యోగులు సోమవారం మండలకేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల పింఛన్ల పంపిణీ అనంతరం పాయకరావుపేట మండల అధికారి సచివాలయ ఉద్యోగి పట్ల అమర్యాదగా వ్యవహరించిన తీరు ను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగుల తరఫున తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. సాటి ఉద్యోగి అనే కనికరం లేకుండా అమర్యాదగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సచివాలయ ఉద్యోగులు సల్మాసుల్తానా, సిద్ధు, ధనుంజయ్, ఉమేష్, మహ్మద్‌అలీ, హుస్సేన్, శాంతమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మరణంపై సీబీఐతో విచారించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి పోలీసుల వల్లే న్యాయవాది శేషాద్రి మృతి చెందారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కళ్యాణదుర్గం పట్టణంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అడ్వకేట్ శేషాద్రి మృతిపై సీబీఐతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం తగదన్నారు. అలా జోక్యం చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి, సభ్యులు చక్రవర్తి, దాదా ఖలందర్, తిమ్మప్ప చౌదరి, సంపత్, రవికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి సవితను కలిసిన జనసేన ఇన్‌చార్జి



మంత్రితో మాట్లాడుతున్న కదిరి శ్రీకాంత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖామంత్రి సవితను మంగళగిరిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రిలో ఉన్న బీసీ, ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ సరిగా లేదని మంత్రికి తెలిపారు. అదేవిధంగా పోలీసుల పనితీరు బాగా లేదని, సామాన్యులకు న్యాయం కరువైందని వివరించారు. రేషన్ బియ్యాన్ని నిల్వచేసే గోడౌన్‌లో చాలా అవకతవకలు జరిగాయని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరగడం లేదని మంత్రికి తెలిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, పెద్దవడుగూరు మండల కన్వీనర్ షేక్‌దూద్‌వలి, పలువురు నాయకులు ఉన్నారు.

తెగుళ్ల నివారణకు సూచనలు

ఆంధ్రజ్యోతి స్పందన

శెట్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, టమోటా తదితర పంటలకు చీడపీడల ఉధృతి బాగా పెరగడం, వాటి నివారణ గురించి రైతులకు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు ఇవ్వకపోవడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు వ్యవసాయాధికారులు స్పందించారు. ఇన్‌చార్జి ఏఓ వాసుకి రాణి, ఏవో ఆంజనేయులు వెంటనే పలు గ్రామాలకు వెళ్లి వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు సస్యరక్షణ గురించి, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. ఏఈవో ఆమని, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణం



నీలాస్వామిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బ్రహ్మసముద్రం మండలం గుండిగాని పల్లికి చెందిన నీలాస్వామి విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత ఆయన్న బ్రహ్మసముద్రం మండల టీడీపీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు కంబదూరు సురేంద్ర, కనాపురం మల్లికార్జున, మాజీ ఎంపీపీ వన్నూరుస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఓబులేసు, నాగరాజు తదితరులు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి, భైరవానితిప్ప కమిటీ అధ్యక్షుడు కురి మల్లికార్జున, డీలర్ కేశవర్ధన్ గౌడ్, శెట్టూరు మండల కురుబ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఐటీడీపీ ఛాంపియన్ బజ్జన్నగౌడ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రాయదుర్గంరూరల్/ గుంతకల్లుటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం సంక్షేమపథకాలను వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. రాయదుర్గం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆవిర్భవించి నేటితో 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై యూనియన్ అనేక రాజీలేని పోరాటాలు చేసిందని తెలిపారు. రాయదుర్గం ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, యూనియన్ కార్యదర్శి రేష్మా తదితరులు పాల్గొన్నారు.